"జవనీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి"

మాతృశ్రీ

"రసప్రియ"
ఫోతేదార్ కేశవాచార్య, బి.ఎ.
శ్రీరంగాపురం.

మాతృశ్రీ / రసప్రియ

ప్రథమ ముద్రణ : 500 ప్రతులు

ముద్రణ : ప్రమాధి మార్గశీర్షము 2000 జనవరి

రచన : 1958 - 59

హక్కులు : రచయితవి

ముఖచిత్రము : కల్యాణి Ch వంశీగంగాధర్ V.
(రచయిత దౌహిత్రి, దౌహిత్రుడు)

భోజప్రచురణ : 13

వెల : రూ. 30-00

ప్రతులకు :

"రసప్రియ" F. కేశవాచార్య
C.P.O. (Rtd)
ఇం. నెం. 6-2-23/A, తుమ్మలగడ్డ బజార్,
ఖమ్మం - 507 001. A.P.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాదు - 500 001.

"నవయుగ" బుక్ డిస్ట్రిబ్యూటర్స్
సుల్తాన్ బజార్, హైదరాబాదు.

కృతిసమర్పణ

గ॥ జనని నీస్మృతి కోసమే పనియొనర్చ
సతముగాదది కావ్యమో శాశ్వతముగ
వెలయగలదని యెంచి నీపేర దీని
గూర్చినాడను గాన గైకొనగదమ్మ!

గీ॥ నన్ను నవమాసములు మోసి కన్నతల్లి!
నన్ను ప్రేమసాకిన కరుణాపయోధి!
నీ పవిత్ర పాదాల కన్నీళ్ళఁగడిగి
కృతి సమర్పింతు నీకు సంప్రీతిగొనవె!

ఉ॥ ఒక్కొక పద్దియంబున కెదో
పెడదైయెడదన్ గలంచి నా
దృక్కుల నీరు గ్రమ్మ రచియించితి
నీ స్మరణార్థ మీ కృతిన్
మక్కువ స్వీకరింపగదె నన్
గడుపారగ కన్నతల్లి! నల్
దిక్కుల కెక్కు నీ పృథుల
దివ్య పవిత్ర చరిత్ర చందికల్!

మాతృదేవోభవ

శ్లో॥ "భూప్రదక్షిణ షట్కేన
కాశీయాత్రా యుతేనచ
సేతుస్నాన శతైర్యశ్చ
తత్ఫలం మాతృ వందనే"

అన్నదమ్ము లెందరైన
కన్నతల్లి ఒక్కటేరా!
మతం కులం వేరైనా
మాతృ దేశ మొకటేరా!

తల్లిని మించిన దైవం
ధరణిలోన లేదురా!
జన్మభూమి కన్న మిన్న
స్వర్గ మేది లేదురా!

ప్రసవ బాధ కలిగించిన
పసిబిడ్డను ముద్దాడుచు
స్తన్యమిచ్చి తన సర్వ
స్వము విరజిమ్ముచు పెంచును.

అమ్మ ఎంత కరుణామయి!
అమ్మ ఎంత పరదైవము!
అమ్మ ఋణము జన్మలోన
అణువంతయు దీర్చలేము.

— రసప్రియ

మాతృశ్రీ

అభినందనాశీర్వాదములు

"ఆంధ్ర బెర్నార్డ్‌షా"
జగజ్జనని వేదాంతకవిగారు

దేశము నీ సుదుల్ వినెడి ధీనిధివై విలసిల్లి విశ్వసం
దేశము దిక్కులెక్కి వినుతించెడి కైవడి ఇమ్ము శ్రీవితో
కేశవ! తల్లి చల్వలకు కేలు మొగిడ్చి చిగుర్చు కైత వా
గీశుల కెక్కి కీర్తి గడియించుము నీకు చిరాయువుల్ సిరుల్!

నామము తెన్ని యోగలవు నాటికి నేటికి వాటిలోన నీ
నామము శ్రేష్ఠమై మొదటి నామముగా విలసిల్లె కేశవా!
నీమధుర ప్రసన్న కమనీయ కళాకవనమ్ము గూడ భా
షామణి చల్వతో వెగడి శాశ్వతమై పొగండించు ధాత్రిపై!

మునుముందీవు కవిత్వ మల్లుటకు బాబూనీవు కైమోడ్పి నీ
జననీరత్నమునే గ్రహించితివి, పూజల్సల్పి నీతల్లి చ
ల్లని చల్వల్ కురిపించు కొంటివి, కళాలావణ్యయై నీ కవి
త్వనటీరత్నము దిక్కులెక్కి సిరిపూతల్ పూచుత౯ కేశవా!

"ఆంధ్ర మిల్టన్"

శతావధాని డి.కె. బాలబ్రహ్మాచార్యులుగారు

సీ. మాతృశ్రీ గ్రంధము
ప్రేమజ్ఞ వినిపించ వంటి విషయంబునకే
నామోద మొందితిన్ గదు
క్షేమంబగు నీకు కృతికి కేశవ సతమున్!

మాతృాద్వైత విముక్తి జిత్తమున సంభావించి యేరీతిగా
మాతృశ్రీని రచించినావు కృత ధర్మా! కేశవాచార్య! స
న్మిత్రుల్ మెచ్చి నుతింప నీకృతిశుభోన్మేషాప్తిమై మాతృక
ర్త్రాత్మప్తి ప్రదిపాదియైవెలయు సుష్మాచంద్రతారార్కమున్!

అర్థి జనంబు గోరిన సహాయము శక్తి కొలంది వల్పని
స్వార్థపరుండుసాధుహితబంధురతుండయియెన్న డేనియున్
వ్యర్థులజోలికిన్ జనక పండిత మైత్రి వెసంగి కేశవం
దర్థగణాంకశాఖ నవహా! అధికారము నంది వర్థిలెన్.

"ప్రసన్న భారత వ్యాస"
వాజపేయయాజుల రామసుబ్బారాయుడు గారు

నీవు రసప్రియుండవవనిన్ రసవంతము లై ప్రసన్న మై
చేవ గలట్టి సత్కృతులచే విలసిల్లుచు నుంటివీవు, శి
ష్యావళిలోన నశ్రీజుడ వంచు దలంచుచు నుందునిన్ను,
తావిభుడిచ్చుగాత బ్రమదంబుగ నీకు చిరాయురున్నతుల్.

—

త్రయ్యర్థికావ్య నిర్మాత మహాకవి శేఖర, కవిసింహ
పోకూరి కాశీపత్యవధానులుగారు

చారు పదాంచితంబునయి శ్రావ్యమునై రసవత్తరంబునై
సూరి మనోహరంబునయి శుంభదలంకరణాన్వితంబునై
భూరి సలక్షణంబునయి పొల్చెడు కైత గలట్టి కేశవా
చారికిచెల్లునంచుమ "రసప్రియ"యన్ బిరుదంబునిచ్చితిన్

గురునియందు భక్తి కోవిద కవులందు
ప్రీతి యనుజ మాతృ పితరులందు
దయగలాడు పోతెదారు శ్రీ కేశవా
చారి సుగుణరాశి యౌర తలప!

వీడడు శమమున్ దమముఁ
వేడడుమాధవుని దక్క వేరొక వేల్పుఁ
కూడడు దురితాత్ముల నెపు
డాడడు కల్లలను కేశవాచారి సుడీ!

'కవి సార్వభౌమ'
వడ్డాది సీతారామాంజనేయకవిగారు

పుస్తకము పేరు "మాతృశ్రీ". ఆపేరులోనే ద్యోతక మగుచున్నది విశ్వపునీతమగు పవిత్రత. ఆ పవిత్రభావ పరిశుద్ధి సాధన చేసి, సాధించినది గాక సమస్త ప్రాణి హృదయాంతరాళముల యందును ప్రతిధ్వనించు ప్రేమా ను యుక్త మధుర మధురాతి శబ్ద బ్రహ్మము. జననము నొందిన క్షణము నుండియూ పసితనమున, కన్నతల్లి కరుణామృత పయః పూర్వములతోనూ, బాల్యమునుండి యూ తల్లి నిర్మల హృదయ ప్రేమామృత రసపరిప్లుతా హార సేవనముతోనూ తరువాత తల్లి హృదయ ద్రవీ భూతామరాగ సిక్తవాత్సల్య సేచనములతోనూ మాన వత్వము సిద్ధింప నిర్మలానంద డోలికల విహరించు మాన వుని హృదయ దర్పణమున మాతృమూర్తి దయామయ మూర్తి భాసిల్లుచుండుట సహృదయులకు విదితము. తీర్థపాదులగు శంకరులు గూడ మాతృదేవతా స్తుతిలో " క్షుధార్తా జననీం స్మరంతి " యని వాక్రుచ్చినారు గానతన తనయుని లాలించుట, పోషించుట తల్లికే తెలియ వలెను. పిల్లయాకలి తల్లికిదక్క ఇతరుల కెట్లు తెలియును కనుకనే ప్రతి జీవియు బాధ కలిగినపుడు అమ్మా! యని తలచి వాపోవు చున్నది.

శిశువు గర్భస్థుడైనది మొదలు కలుగబోవు బిడ్డపై మమకారముచే నవమాసములు మోసి, దుర్భర ప్రసవ వేదనల భరించి, పుట్టినబిడ్డ మొగంబు చూడగనే తనబాధ

మరచి, ఆనందమున మున్గుచు, అనురాగ పారవశ్యమున నేమ మరచుచూ, తన మధుర పయోధారల బిడ్డని పెంపొంద జేయుచు తన సర్వస్వము బిడ్డనికై ధారపోయు మాతృదేవత జీవికి ప్రత్యక్ష దైవతముగాదా! బిడ్డని సేమమునకై తహ తహలాడుచు వేయిదేవుళ్ళకు బిడ్డను చిరంజీవిగా జేయుమని గడియగడియకూ మ్రొక్కులిడుచు తన సుఖమును వదలి బిడ్డయే తనపెన్నిధియన మురిసి మురిపించు తల్లికన్న యిహలోకమున పరదేవత యెవరు? "నమాతుః పరదైవతమ్మ్" ని పెద్దలు చాటియుండిరి గదా! అందుచే జీవికి మాతృదేవతయందు ప్రేమ భక్తి గౌరవము గలిగి యుండుట కృతజ్ఞతా సూచకము. మానవ సహజ స్వభావము. తద్వ్యతిరేకత మానవ జన్మమునకు వ్యతిరేకమగు పుట్టువుగా నెంచబడును.

తల్లి తన సంతానమును జూచుకొనుచూ అనిర్వచనీయానందమెట్లు పొందుచుండునో యట్లే సంతానము గూడ మాతృమూర్తిని సేవించుచూ స్వర్గసుఖంబుల కన్న మిన్నయగు సౌఖ్యసంపదల ననుభవించు చున్నట్లు భావ సంతుష్టిని పుష్టినందు చుండును. "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి''కాని రానురాను మానవుల మనః ప్రవృత్తి వెర్రితలలు వేయుచుండుటవే అడ్డాలనాడే బిడ్డలుగాని గడ్డాలనాడు కాదని మాతృదేవత శోకించు పిదప కాలము దాపురించినది. భార్య కాపురమునకు వచ్చినదాది తనను

అష్టకష్టములుపడి పెంచి పెద్దచేసి, తనజీవితసర్వస్వమును ధారవోసి, దేహదార్ఢ్యము తిరిగి బెండువారి జరాభార కృశీ భూతమగు తల్లిపై యేవగింపు నిర్లక్ష్యము, విసుగు కలిగి యామె తనపై పెట్టుకున్న యాస వడియాస గావించుచు తనప్రవృత్తియే యామెకు హృదయశల్యమై వేధించు నటుల ప్రవర్తించు కుపుత్రులు బహుళముగా పెరుగుట భారతదేశ దౌర్భాగ్యము, మాతృదేవతల పురాకృత జన్మ పాప ఫలము.

అట్లని అందరూ నట్టికృతఘ్నులు మాతృద్రోహులు కారనుటకు యీ కృతి కర్త లవంటి నిరంతర మాతృదేవతా పూజా సక్తులు కొందరు క్వాచిత్కముగా నుండుట నాయీ మాతృదేవతల యదృష్టము.

"మాతృశ్రీ" యను నీ సత్కృతియట్టి ప్రత్యేక విశిష్టతతో గూడికొన్నది. కృతి ప్రారంభము నుండియూ కృతికర్తకు మాతృదేవత పైగల భక్తి ప్రపత్తులు మూర్తీభవించుచూ తైలధారా విచ్ఛిన్నముగా ప్రవహించినది. కవితా వేశమునకు మూలకారణము తన్నుగన్నతల్లి వైద్య శిఖామణుల కందరాక ప్రాణసంకటముగా పరిణమించిన వ్యాధితో బాధపడుచుండగా జూచి సహింపలేని కుమారుని హృదయమున జనించిన యాందోళనమే ప్రాతిపదిక. అట్టి ఆవేదనమే పద్యరూపమున రూపుగొని కవికి మాతృదేవత యందుగల ప్రేమ, అనురాగమును చదువరుల

డెందముల నిండుకొనుచు వారి మనఃపీఠముల సైతము మాతృ భక్తి మాతృ వియోగ జనిత దుఃఖమును స్పందింప జేయు సమర్థతతో వెలుగొందిన కవి యుపాసించు మాతృమూర్తి కమరత్వమును కవి కవితా కృషికి సార్థక్యతను చేకూర్చినది. ఇది తొలుతటి కృషి గావచ్చును. ముందుముందు మాతృశ్రీ ఆశీర్విశేషంబున ఉత్తమ కృతి పత్రికల ప్రవర్ధిల్ల జేయగలరని యీ కవి వరునకు మా కామేశ్వరి యాశీస్సు.

—

శ్రీరస్తు

ఓం నమః కామేశ్వర్యై

ప్రశంస

శ్రీ తరుణీ శ్రీవాణీ
మాతృశ్రీ కరుణ నొందద మానిత దీక్షన్
జేతమ్మున బూజించుచు
ఖ్యాతిన్ మనుమయ్య కేశవాచార్య కవీ!

కవితా మాతృ శ్రీ పద
వవనళినా సవముం గ్రోలివ సనాతన స
త్కవి భృంగగీతి నీ మది
కవిరళముద మిడుత! కేశవాచార్య కవీ!

మాతృశ్రీ

సుమన స్ప్రభాగ్రి కాంబూ
లము కవికే, నీకుఁ దత్కళన్ మాతృశ్రీ
ప్రమదమున నొసఁగి గౌరవ
మమరించిన దోహా! కేశవాచార్య కవీ!

రవి కానని చోటైనన్
గవి కాంచుఁగదా? జగత్ప్రకార వివేకం
బవురా! మాతృశ్రీ కృప
నవనిన్ నింపితివి కేశవాచార్య కవీ!

మా రా.సు.రాణ్మహా కవి
నారాధవమున్ బొనర్చిన నఘుని నిమ్మన్
భారతి భారత గౌరవ
హారిగ నలరించుఁ గేశవాచార్య కవీ!

రసవత్కావ్య సుమంబుల
విసరముతోఁ గవితనీవు వెసఁబూజింపన్
బస నొసఁగి రా.సు.రాట్కవి
యుపదృశధృతి మనుచుఁ గేశవాచార్యకవీ!

మాతృశ్రీ

పిన్నతనంబున నెంతో
విన్నాణపుఁ దెలుగుఁగైత వినిపించిన నీ
కున్నతి మాతృశ్రీ యో
యన్నా యిడకున్నె? కేశవాచార్యకవీ!

బియ్యేవై మాతృశ్రీ
వయ్యారే! కొలిచి పావనాత్ముఁడ వగునీ
నెయ్యము వాంఛింపరె కవు
లయ్యా! మేలయ్య! కేశవాచార్యకవీ!

అనయము సీతారామాం
జనేయ కవి సార్వభౌమ సరళాశీస్సుల్
మనుచుత విన్నానందం
బనూనగతి నొసఁగి కేశవాచార్యకవీ!

కవిసార్వభౌమ, స్వరాజ్యకవి
వడ్డాది సీతారామాంజనేయకవి

లజపతిరాయ్ పేట
పాలకొల్లు
5-2-1964

నివేదన

—రచయిత

అది 1958వ సంవత్సరం అప్పటికి నాల్గుదశాబ్దాలు గడిచిపోయినవి. అప్పుడు నేను మాతృశోకంలో వ్రాసికొన్న పద్యాలివి. వ్యథను వెలికి తీయుటకు మనసొప్పక ఇంతకాలం అచ్చు ప్రయత్నం చేయలేదు. వ్యథలో కవి వ్రాయుట మానడుకదా। "అగ్నేరాపః" అగ్నినుండి నీరు పుడుతుంది. తపననుండి కన్నీరు పుడుతుంది. మాతృశోకంలో పరితపిస్తూ వ్రాసికొన్న ఈపద్యాలు నా కన్నీటి కెరటాలు. అవి ఒక సహస్రందాక ప్రభవించి నేటికీ నా యెడద కడలిని కల్లోలపరుస్తున్నవి. వాటినుండి సుమారు వందమాత్రం ఎంపికచేసి మాతృశ్రీ, స్మృత్యంజలి, బాష్పాంజలి, నీరసనాంజలి, హృదయాంజలి అనుఖండికలను కృతిగా సంతరింప జేసినదే ఈ "మాతృశ్రీ".

మాతృమూర్తి ఎవరికి ఆరాధ్య దైవం కాదు? ఆమె ప్రేమ అవ్యాజమైనది. ఆమె కరుణ అపారమైనది. ఆమె క్షమా శమ దమాదులు అనన్యాదృశములైనవి. ఆమె త్యాగనిరతి అనంతవిశ్వానికి చేతనా విభూతి యైనది. ఆమె మమతానురాగాలు నిరంతరం ప్రవహించే జీవనదుల వంటివి. ఆమెలేక ప్రకృతి వికృతిగా మారుతుంది; సమస్త ప్రాణికోటికి కాళరాత్రి అవుతుంది. ఆమెయొడిలో ప్రకృతి

వికసిస్తుంది. సమస్త ప్రాణికోటి వెగడుతుంది. ఇది సార్వ జనీన సార్వకాలీన సత్యము. అందువలన ఇందలి కొన్ని పద్యాలు స్వగతాన్ని స్ఫురింపజేసినా మాతృశక్తి రసానుభూతి సహృదయులోకాని కంతటికీ ఆస్వాదయోగ్య మగు వని భావింతుమ. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అన్నారుకదా పెద్దలు.

నేనప్పుడు హైదాబాదులో ఉద్యోగంచేస్తూ కుటుంబముతో ఉన్నాను 1957 అక్టోబరులో మా అమ్మగారు అస్వస్థులై చికిత్సకోసం హైద్రాబాదులో ఉన్న నాదగ్గరకు వచ్చిరి. ఏడాదికిపైగా చికిత్ససాగినది. ఆరోగ్యరక్షకై చేసిన దైవప్రార్థనలు, బాలల దీవెనలు వైద్యప్రయత్నాలు ఫలించ లేదు. తేది 14-12-1958 విళంబి మార్గశిర శు॥ ౪లు ఆదివారం మా మాతృమూర్తి మమ్ము వీడి దివంగతులైరి. మృత్యువు ఆపరానిదికదా!

విఫల మనోరథుడనై నిర్వేదంలో కుములుతూన్న నాలో అంకురిస్తున్న నాస్తికతను పైదొలగజేసి నాసంతప్త హృదయాన్ని శాంతపరచి నన్నుద్ధరించుటకో అన్నట్లుఅనుకోకుండ ప్రమోషనుపై సెప్టెంబరు 1959లో హైదాబాదు నుండి కరీంనగరుకు బదిలీయి వచ్చి అచ్చటి వేములవాడ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ రాజ రాజేశ్వర స్వామివారిని

సందర్శించు కొంటిని. దర్శన మాత్రాన నామనసూఱట పడ్డది. దర్శించు కొన్నప్పుడెల్ల ఒకటి రెండు పద్యములు శ్రీరాజరాజేశ్వరరా! అనుమకుటంతో వ్రాసికొన్నాను. అట్లు 12 పద్యములు వ్రాయువరకు నా సంతాప ముపశమించి నది అదే మకుటంతో సాగిన ఆపద్యాలు శతకరూపం దాల్చి రెండు సార్లు అచ్చు అయినది. (మొదటిసారి వేములవాడ దేవస్థానములవారి ఆర్థికసహాయంతో రెండవసారి తిరుమల తిరుపతి దేవస్థానములవారి ఆర్థిక సహాయంతో) నిర్వేదం లో నిరాశా ధూమంలో తల్లడిల్లుతున్న నాలో ఆశావాదం ఆస్తికత చిగురించినవి. ఇది ఆస్వామి దయావిశేషమే అని నమ్ముతున్నాను.

పూజ్యపాదులు నాగురు దంపతులు (కీ. శే. రా. సు. రాట్నవి దంపతులు) నా మాతృశ్రీ పద్యాలన్నీ అవశ్యం అచ్చుకావలెనని కాంక్షించిరి, ఆదేశించిరి. తమంత తామే కవిసార్వభౌమ బిరుదాంచితులగు శ్రీ వడ్డాది సీతారామాంజ నేయ కవిగారిచే అభిప్రాయమును వ్రాయించి తెప్పించి ఇచ్చిరి (1964). ఆ మహనీయ మహాకవి జీవించి యుండ గావారిని దర్శించుకొను భాగ్యం నాకు కలుగలేదు వారి అమూల్యమైన అభిప్రాయంతో, మరియు నా మాతృశ్రీ పద్యాలు నేను వినిపించగా విని ఆనందించి, పరమ పూజ్యులు కీ.శే. అయిన మహాకవి వేదాంత కవిగారు

శతావధాని బాలబ్రహ్మచార్యులు గారు, కవిసింహ పోకూరి కాశీ పత్యవధానులుగారు, వాజపేయయాజుల రామసుబ్బారాయుడుగారు అనుగ్రహించిన అభినందనాశీర్వాద పద్యాక్షతలతో ఈ మాతృశ్రీ (అప్పుడు వ్రాసిన పద్యాలు యథాతథంగా) వెలువరించడమైనది. ఆ మహనీయ పుణ్యమూర్తులకు నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు.

ఆనాడు నాకు ప్రాప్తించిన మాతృసేవా భాగ్యం అధిక భాగం తానే గ్రహించి నిండు మనిషియైకూడ నిండు మనసుతో తన అత్తగారికి శుశ్రూషలు చేసి నా మాతృఋణ భారము తీర్చుటలో నాకు తోడ్పడిన నా ధర్మపత్ని సౌ॥ కనకమ్మను అభినందించకుండ ఉండలేను.

ఆగష్టు 1999లో కవిసమయంపై రేడియో ప్రోగ్రామ్ వచ్చింది. ముందుగా స్క్రిప్టు ఇవ్వటానికివెళ్ళాను, స్క్రిప్టు చూడకుండానే ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గారు కవిగారూ ఇది ఎలక్షన్స్ జరుగుతున్న సమయం మీరేదో కార్గిల్ పైన నో సామాజికమో వ్రాసికొని తెచ్చి ఉంటారు. అదిప్పుడు వద్దుఅన్నారు మరేదికావాలి? అన్నాను 'మాతృమూర్తిపైననో ప్రకృతి పైననో వ్రాసికొనిరండి' అప్పుడు నేనింటికి వెళ్ళి మాతృమూర్తిపైఎన్నో పద్యాలు వ్రాశానుకదా! అని ఆనాటి మాతృశ్రీ పద్యాలలో కొన్నిటిని మరికొన్నిటిపైరు

దొరసానిపై వ్రాసి కొనివచ్చి రేడియో ప్రోగ్రాం పూర్తి చేసి కొంటిని. ఈసందర్భంనాకు "మాతృశ్రీ"ని ముద్రించ వలె నని సంకల్పం కలిగించింది.

స్మృతులుంచు కొనరాదని అంటారు కొందరు. ఎందు కని, తెలియదు. అట్లైతే తర్పణాలు పితృదేవతలకు విడవ టం యుగాలనుండి వస్తున్న సంప్రదాయాన్ని కాదన గలమా! స్మృతులుంచు కొనడంలో తప్పేముంది? లేదు అని నా అభిప్రాయం.

నలుబది రెండేండ్ల క్రిందట వ్రాసికొన్న సుమారు వెయ్యి పద్యాల నుండి ఎన్నో పద్యాలు, దైవ ప్రార్థనలు, విషాదభరితాలు, స్వానుభూతులు, స్వగతాలు కువైద్య నిందలు విడువబడ్డవి. ఈ నాటికి కొన్ని పద్యాలైన అచ్చు రూపంలో మాతృస్మృతిగా వెలువరిస్తున్నందుకు తృప్తిగా ఉంది. కృతి ప్రసక్తి పద్యరూపంలో విన్నవించు కొన్నాను

నూతన సహస్రాబ్దికి స్వాగతం పలుకుతూ సర్వ జనాళికి శుభం కలుగాలని కోరుకుంటున్నాను.

సర్వేపి సుఖి నస్సంతు - అంతా సుఖించాలి.
సర్వేసంతు నిరామయాః - అంతా వ్యాధిరహితులు కావాలి.
సర్వేభద్రాణి పశ్యంతు - అందరూ శుభాలు దర్శించాలి.
మాకశ్చిద్దుఃఖభాగ్భవేత్- ఏఒక్కడు దుఃఖభాజనుడు కారాదు

— కేశవాచార్య

కృతిప్రసక్తి

కం॥ ఇది మాతృశ్రీ దీనిని
చదువుచు నున్నపుడు కనుల జలమూరుచు నా
యెదనొచ్చునైన దీనిని
జదువుచు నేయుండు మాతృసంస్మృతి యగుటన్.

ఆ॥ మాతృ శక్తి యున్న మనుజుం డెవ్వండేని
దీనిం జదివె నేని వాని మనసు
వెన్న వోలె కరగి కన్నీరుగా మారి
జాలు వారకున్నె సౌమ్యుడైన?

గీ॥ వేదనా రోద నావేదనాదులెవడు
పొందునో వాడెపోకవి, పొరలివచ్చు
వాని ప్రతి బాష్పకణమొక పద్యమగుచు
విశ్వవీణను మీటి వినిపించు చుండు.

గీ॥ ఏడ్వవలెనని యుండునే ఎవనికైన
ఏడ్పువచ్చిన యెవడుండు నేడ్వకుండ
కవనమా! ఏల వన్నిట్లు కలచి కలచి
ఏడ్పు పద్యాలు వ్రాయించి తేలయిట్లు?

గీ॥ అగ్నిలో నుండి ప్రభవించు అంబువట్లు
బాధలో నుండియే పుట్టు బాష్పకణము
గాయమే గేయరూపాన కరుణగాను
జాలువారుచు నుండు పద్యాలలోన.

గీ॥ అందుకే అప్పకవి యిట్టులనుచు నుడివె
ఎవడు కరుణామతియొ వాడె కవి యనబడు
శోకమున నుద్భవించెడు శ్లోకములను
పాడుకొన జేయుచును కవి నేడిపించు.

గీ॥ తపనలో నుండి మానవత్వము ద్రవించి
కరుణ రూపాన కన్నీటి కడలి యగుమ
శోకజలధిని ప్రభవించు శ్లోకలక్ష్మి
క్లేశముల బాపి జనుల రక్షించుగాక!

—

"తస్యశోకః శ్లోకత్వమాగతః"
'కవితఅనిన వేడి కన్నీరు మాత్రమే'

"Poetry is the sister of Sorrow
Every man that suffers and weeps is a poet
Every tear is a verse And every heart a poem."

— ANDRE

"Poets teach in verse what they learn from suffering" — SHELLY

" It is not true that I made Poems
In fact my poems have made me.' — GETE

శ్రీ మత్పర దేవతా యైనమః

మాతృశ్రీ

ఆ॥ మాతృభాషలోని మాధుర్యమును గ్రోలి
మాతృదేశ కీర్తి మహిని జాట
మాతృసేవ జేయ " మాతృదేవోభవః "
యనెడి సూక్తి పుట్టె నవని లోన.

గీ॥ ఖగమృగాదులు సైతమీ జగతి తమదు
పిల్లలను నిత్యమెంతయో ప్రేమసాకు
తల్లి ప్రేమ గణింప దుస్తరము గాన
తల్లియే కద ప్రత్యక్ష దైవ మరయ.

ఆ॥ కడుపునిండ పాలు కుడిపి బుగ్గల మీద
ముద్దులు కురిపించి బుజ్జగించి
నిగ్గు కేలి డోలి నిదుర బుచ్చుచు చాల
మురిసిపోవు తల్లి మోదమలర.

ఆ॥ ఇదిగో! పిట్ట బుక్క ఇదిగో! కాకమ బుక్క
బుజ్జి తినుమటంచు బుజ్జగించి
పసిడి వంటి చేత పాలబువ్వను బెట్టు
అమ్మ మమత కెంత కమ్మదనము!

సీ॥ ఈయ్యాలి లాదున నయ్యాటలాడెడు
ముద్దు పట్టిని గాంచి మురిసిపోయి
ఉగ్గుపెట్టగ నెంతయో గోలగా నేడ్చు
బాలవతంసమున్ జోలబుచ్చి
ఇల్లంత దొర్లుచు నల్లరి చేసెడి
బుజ్జి యబ్బాయిని బుజ్జగించి
చిగురాకు పెదవుల చిరునవ్వు చిలికించు
చిట్టి పాపని మోము చెలువ మరసి
గీ॥ నిగ్గులేత గులాబీల బుగ్గల పయి
మురుపు ముద్దుల వర్షంబు కురియజేసి
పొంగి పోయెడి తల్లి యపూర్వ కరుణ
సాటిలేనిది పదునాల్గు జగములందు.

గీ॥ ప్రసవ బాధల భరియించి బడసి బిడ్డ
లను పిదప వారి మూత్ర మలాల మునిగి
ప్రేమ లాలించి పోషించి పెద్దజేయు
తల్లి ప్రేమకు సరియేది ధరణియందు.

గీ॥ సహజ కవితాసుధారస శైలివోలె
కలువరాయని వెన్నెల చలువవోలె
మధురమై చల్లనై యుండు మాతృ ప్రేమ
జగములో మాతృ ప్రేమకు సాటిగలదె?

గీ॥ అమ్మ బంగరు గర్భాలయమ్ములోన
వాసమున్నంత కాలమే బాధలేదు
పుడమి పై రాకతో వచ్చె నిడుములన్ని
నీటి బాసిన చేపకు చేటురాదె?

గీ॥ అంబయను శబ్దమెంత సారంబుగలదొ!
వేదమై విశ్వమంతట వెలసిపోయె
అట్లుగాకున్న నేర్పించినట్లు ఏల
పలుకుచున్న "దంబా" యని పశువుగూడ.

గీ॥ తేనె రుచి జూడ లభియించు తియ్యదనము
కన్న లక్షలరెట్లకు మిన్న నుండు
అమ్మయను పిల్పు లోగల కమ్మదనము
కాన అమ్మను మరువ శక్యంబుగాదు.

కం॥ అమ్మా! యను కమ్మని శ
బ్దమ్మును నోరార నెవడు పలుకును పలుమా
ర్లిమ్మహిలో వానికి వే
దమ్ములు చదివిన ఫలమ్ము తప్పక నొదవున్!

గీ॥ అరయగా మాతృప్రేమకు అర్థమిదియె
ఎంతటి విరక్తుండైన నెంత దుష్టు
డైన లోకమునకె గాని వాని తల్లి
కెంత ప్రాణమొ వచియింపనేరి వశము॥

ఆ॥ గొప్ప పదవులంది కొండంత వాడైన
తల్లి ముందువాడు పిల్లవాడె
లోకమునకు యెంత లోకువై యున్నను
కొడుకు తల్లికవని కొండపెట్టు.

కం॥ నరికెడి వానికి నైనన్
తరువిడదే నీడ నట్లె తల్లియు తనను౯
నరికెడి కుపుత్రు నైన౯
కరుణన్ మన్నించు కన్న కడుపెట్టిదయో॥

కం॥ తననున్ మొదలంటగ గో
సిన రైతుకు పంట నొసంగు క్షితిపైరు వలె౯
తను జంపు ధూర్తుడైనన్
తనయుని దీవించు కన్న తల్లి ధరిత్రిన్.

మాతృశ్రీ

గీ॥ క్రూరుడైనను మిక్కిలి కుటిలుడైన
ధూర్తుడైనను మరి కులద్రోహి యైన
తనను జంపెడి వాడైన తల్లి యొకతె
కూర్మి ప్రేమించు మన్నించు కొడుకు నెపుడు.

గీ॥ మిన్ను పైనున్న చుక్కల నెన్న వచ్చు
అర్కశశి మండలంబుల కరుగ వచ్చు
వర్ష బిందువులను గణింపగను వచ్చు
తల్లి ఋణ మెన్నటికి దీర్చ తరము గాదు.

గీ॥ తల్లికన్న మిన్న దైవంబు కనరాదు
తండ్రికన్న మిన్న దాత లేదు
తల్లి దండ్రులకును తగు సేవ జేసెడు
వాఁడె ధన్యుడరయ వసుధ లోన.

ఉ॥ మాతయె జన్మకారణము మాతయె రక్ష జగంబులోపలన్
మాతయె సర్వజీవులకు మంగళదేవత కాన సర్వదా
మాతృపదారవిందముల మస్తక మందు ధరించి భక్తితో
నేతన యుండు సేవలొనరించు నతండె కృతార్థజన్ముడౌ॥

సీ॥ గుళ్లలో గూర్చున్న రాళ్ల దేవుళ్లకు
ప్రొక్కులు చెల్లింప మోజులేదు
కాసులు వెచ్చించి కాళ్ల తీపులు బాయ
తీర్థయాత్రలు జేయు దీక్షలేదు
యెడ్డిగా గురువుల గుడ్డిబోధల ముక్తి
సాధించవలెనన్న బాధలేదు
ఉపవాసములు సల్పి జపతపమ్ములొనర్చి
శక్తిగడించు ఆసక్తిలేదు.
గీ॥ కాని ప్రత్యక్ష దైవమౌ కన్న తల్లి
పదములకు ననుదినము సద్భక్తి మీర
వందనము లాచరించి ఆనంద బాష్ప
ములను రాల్చగ ఆకాంక్ష గలదు నాకు.

గీ॥ జన్మ జన్మల మరువక జనని ఋణము
వ్రాసి కొందును హృదయ పత్రమ్ము మీద
మాతృమూర్తిని నిరతము మరవకుండ
హృదయ ఫలకము మీద చిత్రించుకొందు!

గీ॥ అమ్మ యొక్కటె సాక్షి దైవమ్మటంచు
అమ్మ పద పద్మముల చెంత తుమ్మెదనయి
అమ్మ కీర్తిగీతికల ముదమ్ము మీర
కావ్యగానమ్ము సేయ నా కాంక్షగలదు.

స్మృత్యంజలి

కం॥ జననీ! కృపాతరంగిణీ!
నిను దలచిన యంత కనుల నిండుచు మప్పొం
గిన జలమున నభిషేకం
బొనరింతు భవత్పదాబ్జ యుగళికి భక్తిన్!

ఉ॥ భారము నెంచకుండ నను బంగరు
గర్భమునందు మోసి ఈ
ధారుణి జూపి నీ అమృత ధారలతో
నను బెంచి నా పయిన్
బేరిమి కూర్మియెప్డు కురిపించిన
తల్లివి నీవు జన్మలో
నీ ఋణ మెట్లు దీరు జననీ!
పరి పూర్ణ కృపాతరింగిణీ!

ఉ॥ కంటికి రెప్పవోలె నను గన్న
దినంబున నుండి యెప్పుడే
కంటక మంటకుండ కడగంటను
గాచుచు నా కొకింత కీ
డంటిన రాత్రియుఁ బవలు ఆరట
మంది మదీయ సేవలో
కంటి కొకింత కున్కయిన గానవుగా!
జననీ! కృపాధునీ!

మాతృశ్రీ

ఉ॥ ఇంటికి పెద్ద దిక్కు వగుటీవెటు
మమ్మోడ బాయలేక నీ
వొంటరివై మరెక్కడ అయో
మయమై పడి కొట్టు కొంటివో
కంటికి కానరావు మము గన్న
దయామయి! మాకు నీ వదా
లంటెడు భాగ్యమింక కరువయ్యెగదా!
జననీ! కృపాంధునీ!

సీ॥ లవమైన విసుగక నవమాసములు మోసి
నన్నుగాంచినది నా కన్నతల్లి
అసు రుసురు మనక ప్రసవ బాధలకోర్చి
నన్నుగాంచినది నా కన్నతల్లి
కనుగందుగా నుండ కంటికి రెప్పనై
నన్ను గాంచినది నా కన్నతల్లి
కూరిమి పేరిమి గోరు ముద్దలు పెట్టి
నన్ను పెంచినది నా కన్నతల్లి.
గీ॥ ఇంతపయికాక చేసిన వంతజెంది
రాత్రి శివరాత్రిగా నిదురలకు వాసి
ఓర్మి నుపచారములను జేయుచును నన్ను
గారవాన సాకినది నా కన్నతల్లి!

సీ॥ ఓరిమి యందున ధారుణి దలపించు
మాతృదేవత నిన్ను మరువగలనె?
కారుణ్య మందు బొంగారు నీరధి బోలు
కరుణామయీ నిన్ను మరువగలనె?
నిస్వార్థమందున నింగిని మరపించు
పరదేవతా నిన్ను మరువగలనె?
ఆత్మ బలమునందు అనిలము సరితూగు
మముగన్న తల్లి నిన్మరువగలనె!
గీ॥ శౌచమున వగ్ని సమముగా దోచు నిన్ను
పరమ ప్రత్యక్ష దేవతా మరువగలనె?
పంచ భూతాలు నీలోన పరిఢవిల్ల
జనని నిను మరువగలనె ఈ జన్మలోన.

గీ॥ నీదు సహనము భూమిని, నీదు నీవి
జలదముమ, నీ శుచిత్వము జాతవేది,
నీ దయాపూర్ణత సుధాంబునిధిని మించ
మాతృదేవతా నిన్నెట్లు మఱువగలను?

గీ॥ పరమ సాధ్వివి సౌభాగ్యవతి వటంచు
వెదకి పేరంటమునకు నిన్ వేల్పు సతులు
పెద్ద ముత్తైదువ వటంచు బిలచి రాక్కొ!
కానిచో దివికిపుడె యేగంగ నేల?

మాతృశ్రీ

ఆ॥ పుత్రులందు నీకు పుట్టెడు బేరిమి
కూతు మీద నీకు కూర్మి మెండు
భర్త మీద నీకు భక్తి నిండగు గాన
దివికి నెట్టు లేగితివో గదమ్మ!

గీ॥ ముదిమి భార మొకింతయు ముట్టనపుడె
పౌత్రదౌహిత్రులను నేత్రపర్వముగను
కనుచు మురియుచు కాలంబు గడుపుచుండి
యును సుమంగళ వతిగను చనితివమ్మ!

ఉ॥ ముప్పది మూడు ఏడులయి పోయె
సుమంగలివై సుశీలవై
మెప్పుగ పుట్టినిల్లు మరి మెట్టిన
యిల్లు పవిత్ర సీమలై
యొప్పగ గీర్తి గౌరవ సమున్నత
దీప్తుల గ్రాలజేసితౌ
గొప్పతనంబు తల్లివని గొప్పగ
జెప్ప నిజంబువల్కితిన్.

సీ॥ నిద్దమౌ నుదుటను పెద్దకుంకమ బొట్టు
శశి భాస్కరుల బాల్య దశను దెలుప
స్తవనీయ కోమల నవనీత హృదయమ్ము
పరమ శాంత నిశాంత సరణిదోప

సౌమ్యతాప్యాయతల్ జాలు వారెడు వాక్సు
ధారసంబమల కాసారమనగ
నిరుపమానంబైన కరుణారసమ్ము పొం
గులు వారి పొరలెడి జలధిఁబోల
భవ్యతరమైన నీ పాదపద్మములను
పూజ జేసెడి భాగ్యంబు పొందకుండ
జేసె విధినేమటంచు దూషించువాఁడ
మాతృదేవతా నిన్నిఁక మఱతునెట్లు.

సీ॥ బావను గురువుగా భావించి భక్తినె
వ్వేళ అందున గౌరవించినావు
మరదిని సతతము కరుణను నెరపుచు
సోదరునట్లుగ జూచినావు
తోడబుట్టినవారితో సమంబుగ వది
నల మరందఱులను దలచినావు
కోడండ్రినో లెస్స కూర్మిపేర్మల తోడ
గన్న బిడ్డలవలె గాంచినావు
అక్క చెల్లెండ్రిగా నసమాన ప్రేమతో
నేరాండ్రి నాత్మలో నెంచినావు
గీ॥ కన్న బిడ్డల ప్రాణాలుగా దలంచి
పతిని దైవంబుగా నెంచి భవ్యగరిమ
కర్మ సంసార రథమును ధర్మ మార్గ
మందు నడిపించినావు మాయమ్మ నీవు.

సీ॥ పల్లెత్తు మాటైన పతికెదురాడక
పతియె దైవంబన్న భక్తురాలు
గృహమందు సద్ధర్మ గృహిణియై పనులందు
ధవునకు తోడ్పడ్డ ధర్మపత్ని
పదిమందిగల కుటుంబమునకు విసుగక
ఆహార మిడి సాకు అన్నపూర్ణ
ఎరుగదు పతికి మున్నెన్నడు భుజియించి
పావన గుణయుత పరమసాధ్వి
గీ॥ ఓర్పునందున భూదేవి నోడజేయు
నవని పతిభక్తి సావిత్రి నపహసించు
తలప మితభాషి యగుచు సంతతము మెలఁగు
ప్రేమ ననుగన్న తల్లి రామామతల్లి!

ఆ॥ అత్త వలెనె నీవు ముత్తైదువుగ నామె
అడుగు జాడలంటి అమరపురిని
గాంచ నేగి తట్లు గాక సుమంగళ
వతిగ నేగు టెట్లు క్షితి ఘటిల్లె?

గీ॥ ఒకరి నొకమాట యనలేదు ఒకరిచేత
యెన్నడొక మాట బడియింత యెరుగవమ్మ!
ఆత్మగౌరవమే ప్రాణమని తలంచి
దాచుకున్నావు అభిమాన ధనము మదిని.

గీ॥ కటకటా! వ్యాధిబాధ నొందుటయె గాక
తమ కొరకు మేము నొందు కష్టములకెంతొ
బాధ పడుచుంటివి నీ స్వభావమెంత
సుస్వభావమొ జనయిత్రి! శుభ చరిత్రి!

చ॥ కొడుకులు కూతురున్ సరియె
కోడలు వేరొకరింటి బిడ్డ నీ
కడుపున బుట్టకున్న కడుగాదిలి
కూర్మి సపర్యచేసె నీ
యిడుముల యందు నీ సుకృతమే
యిటు కోడలి రూపమౌచు తో
డ్పడెనని తోచెడిన్ జననీ! పావనీ!
పూర్ణకృపాతరంగిణీ.

చ॥ ఎరుగవు డంబమింతయును యెవ్వరికిఁ
జెయిసాచి నట్టి రో
జెరుగవు భర్త యిష్టమున కెన్నడయిష్టము
జూపలేదు, ఎ
వ్వరికిని యింటి గుట్టుల రవంతయునైనను
చెప్పకుండ సం
సరణము తీర్చి దిద్దితివి సద్గుణరాశివి
మాతృదేవతా!

చ|| ఎరుగవు మాయ మర్మములు హెచ్చులు
మెచ్చులు లేవు, ఎన్నడున్
బిరుసుగ మాటలాడి యెదురెయ్యము
కయ్యము గాగ మార్చలే
దెరుగవు బొంకు గొంకుల నొకించుక
నైనను కోపతాపమే
మెరుగవు నీకు సాటి యెవరే
జననీ! కరుణాతరంగిణీ!

ఉ|| సన్నుతి జేయ నా కవిత చాలదు
నీదు ప్రసన్న శీల సం
పన్నత గూర్చి నీ సుగుణ పాళి
గణింపగ రాని దివ్యద
ద్యున్నత తారకా వితతి పోల్కి
హృదంబర మందు వెల్గగా
నెన్నగ బూని మూగనయి యెట్లొ
గణింపగ ప్రాకులాడితిన్.

ఆ|| నీ గుణాల వెంట నా గణాలింపుగా
నడువలేక యెట్లొ నడువ సాగె
తల్లివెంట పక్షిపిల్ల లేగగ నెంచి
యెగయ లేక యెట్లొ యెగయునట్లు

గీ॥ నెమలి పదముల మాదిరి నీతనూజు
పదము లందము గాకున్న విదితమైన
నీ సుగుణరాజి పింఛమట్లౌను గనుట
కొదువ యెందున గాను పించదు గదమ్మ.

బాష్పాంజలి

సీ॥ మృదులమై యొప్పు నీ హృదయంబు వికసిత
భవ్య సరోజంబు పగిది దోచ
సాధుసౌశీల్యాది సద్గుణ ప్రకరంబు
చంపక కుసుమంబు సరణిదోచ
పరమ పతివ్రతా పరిశుద్ధ వర్తన
మల్లికా గుచ్ఛంబు మాడ్కిదోచ
సమధిక గృహధర్మ సదమలాచారంబు
పచ్చని చామంతి భాతిదోచ
గీ॥ స్వార్థరహితత చెంగల్వ సమము దోచ
త్యాగశీలత పారిజాతముగ దోచ
రమ్య గుణ పుష్పములను హారముగ గూర్చి
దాల్ప దైవము గొనిపోయె తల్లినిన్ను!

సీ॥ మా కన్నతల్లి సముంచిత దేహము
ప్రజ్వరిల్లెడి అగ్నిపాలుజేసి
మా జననీ శల్య మణి నిచయంబును
ప్రథిత కృష్ణావది పాలుజేసి

మాతృశ్రీ

మా మాతృదేవతా మంగళ జీవుని
పరలోక క్రియ నీవు పొలుజేసి
మా జనయిత్రి సమ్యక్కీర్తి తేజముఁ
పటు దిగంతంబుల పొలుజేసి

గీ॥ మరువరానట్టి మాతల్లి పరమమూర్తి
హృదయ పీఠంబునందు చిత్రింపజేసి
చిరతరాసక్తి నెప్డు పూజింపవలసె
నింతలో నిట్లు జరుగగా నేల లీల?

సీ॥ చల్లార్చెనే? నీదుజాడ్యదావాగ్ని నా
హృదయ జన్య విషాద వృష్టి కురిసి
చేకూర్చ జాలెనే? నీ కాత్మశాంతి నా
కూరిమి దళుకొత్తు నూరడింపు
మాన్పెనే? నీ మనో మరణ భయంబును
స్థైర్యమైనట్టి నా ధైర్యబలము
తీర్చెనే? సరవి మాతౄణ మొక్కింతేని
సుకరమౌ నాదు శుశ్రూషధనము

గీ॥ ఎన్ని చేసిన కాని నీ కెట్టిమేలు
కూర్చి బ్రతికించ లేనట్టి కొడుకు నైతి
విధికృతంబును నెవరు తప్పించగలరు?
ఏమి సేయుదు తల్లి సాధ్వీమతల్లి!

గీ॥ దుస్తరంబైన వ్యాధి నొందుటను బట్టి
కొడుకు శుశ్రూష ఉపయోగపడక పోయె
ననుచు నెంతయో వ్యాకుల మందినావు
మాతృ దేవతా నీ వ్యధ మరతు నెట్లు?

గీ॥ చీకు తొలగించి నిన్ను రక్షింపలేని
నిరుపయోగ్యుడ నౌటచే మరుపురాని
నీ విషాదాంతమైన కన్నీటి గాథ
జీవితాంతము నన్ను శిక్షించుబాధ!

గీ॥ నిన్ను బ్రతికించ నెంచి పాట్లెన్ని బడిన
తుదకు దుఃఖసముద్రమందున మునిగితి
అమృత మాశించి యుంటి పేరాశతోడ
విఫల హాలాహలంబు లభించెనాకు!

గీ॥ నీ శుభాశీస్సులను గొని నిరతమేను
భక్తియుక్తుడనగుచు నీ పాదములను
నమ్మి సేవించు పుత్రుని నన్ను నిట్లు
వదలి దివికేగుటయ ప్రతిఫలము నాకు!

ఆ॥ నా కొకింత వంత సోకనీయక నన్ను
కంటిరెప్ప పగిది గాచినావు
నాకమునకు నేగి శోకాబ్ధి నను ముంచ
న్యాయమగునె నీకు నాదు తల్లి?

మాతృశ్రీ

శా॥ నమ్మంజాల మనంబులో బుడమి
　　　　కానన్ రాకయున్నట్టిదై
నమ్మున్- నన్ దయగాంచి పెంచు
　　　　కతనన్ ప్రత్యక్ష దైవంబు మా
యమ్మే యంచని నమ్మినందులకు
　　　　దుఃఖాంబోధినన్ ద్రోసి, ఓ
యమ్మా! యెక్కడ బోతివే!
　　　　తిరిగిరావా! మళ్ళినన్ గాంచగన్

చ॥ భువి జనయిత్రి యే యెరుగు
　　　　పుత్రుని శోకము మాతృనింక నే
నెవరికి సెప్పుకొందు జననీ!
　　　　ఇటు మమ్మొడబాసి అక్కటా!
యెవరును దీర్చ లేని భరియింపగరాని
　　　　హృదాగ్ని రేపగన్
దివి కరుగంగ పాడియటె,
　　　　దిక్కెవరే మమునూరడింపగన్!

సీ॥ అలొపథిక్ డాక్టర్లు ఆశలేదన్నను
　　　　వైద్యప్రయత్నంబు వదలలేదు
నేటి మందే మని నిర్లక్ష్యభావంబు
　　　　తో తచ్చికిత్సల దూరలేదు

హోమియో మందులతో మానునని యెంచి
దాని నిప్పించుట మానలేదు
బాబాల దీవెనల్ బడసివారి పవిత్ర
భూతి నిప్పించక పోవలెదు

గీ॥ లేదు దేవుని ప్రార్థన లేని దినము
లేదు విశ్రాంతి హృదయాన లేదు శాంతి
ఇన్ని లేదన్న బీదపై కృపను మాలి
నాక మేగితమ్మా! నన్ను శోకపరిచి!

సీ॥ నిత్య మారోగ్యాన నెగడు చుండెడి నీవు
కఠిన రోగంబున గడిపితెట్లు?
గృహధర్మ కార్య నిర్వహణ నుండెడి నీవు
పడకపై మూల్గుచు బడితివెట్లు?
పొరిగిండ్ల కెన్నడు పోవనేరని నీవు
పురివైద్యులిండ్లకు నరిగితెట్లు?
ఎన్నడైనను చింత యెరుగకుండెడి నీవు
ఘనతర దుఃఖాన మునిగితెట్లు?

గీ॥ అంచుకేనియు కష్టంబు లెన్నడేని
యెరుగనట్టి నీవు కటకటా యింత కష్ట
మెట్లు భరియించితివి విధి యెంత జేసె?
మాతృదేవతా నీవ్యథ మరతునెట్లు?

గీ॥ వ్యాధి యని వార్యమని మనోవ్యాధి చేత
వ్యాకులము నొంది బ్రతుకు నిరాశజెంది
విధికిలొంగి నీ వెంతక్షోభించినావు!
మాతృదేవతా! నీ వ్యథ మరతునెట్లు?

శా॥ నా మాటన్ మదినెంత నమ్మితివొ!
చింతన్నేడు బోనాడి ఆ
రామున్ వేడు మటంచు చెప్పగనె
దౌర్బల్య ప్రయాసంబుతో
"రామా రామ" యటంచు బల్కితివి
ఆ రాముండు ప్రత్యక్షమై
ప్రేమన్ బల్కెనొ లేదొ! నేనెరుగ
తల్లీ! తెల్పకె పోతివే!!

గీ॥ జనని నిమగావు మన్న ప్రార్థనల వినియు
కటకటా! నిను క్రమింగి దుఃఖమిడె మిత్తి
పూల దండల గైకొని ముండ్లదండ
లొసగివట్లిక నేమి సేయుదును తల్లి!

గీ॥ ప్రళయ జలధి తరంగ ప్రవాహమందు
కొట్టుకొని పోవుచుండెడు కొండలట్లు
సరవి నా ఆసలన్ని దుర్భర విషాద
గాఢ బాధా ప్రవాన గదలిపోయె!

మాతృశ్రీ

నిరసనాంజలి

గీ॥ అమిత తాపంబుచే నీదయామృతమును
బడసి సుఖియించు కొఱకు నే పరుగు లిడితి
గాని మృగతృష్ణగా మారెగా అమృతము
క్షితిని దురదృష్టుడెట్లు మేల్ జెందగలడు?

ఆ॥ తానొకటి దలంప దైవంబొకటి గూర్చు
దైవ విధికి అడ్డు తగుల లేము
తలచుకున్న దెల్ల తప్పక నెరవేర
దైవముండె నమచు తలతురెవరు?

ఆ॥ విధివశంబుచేత విశ్వసంతానంబు
కష్టపడుచు సుండ గాంచలేక
దైవమన్న తండ్రి దాగిపోయెనేమొ
కాకపోయెనేని కానబడడె?

ఆ॥ చావుపేరు విన్న సకలప్రాణికి భీతి
బాధలెన్నియున్న బ్రతుకె ప్రీతి
భీతిలేనిచావు ప్రీతిలేని బ్రతుకు
లేదు లేదు జగతి లేదులేదు.

గీ॥ వెంట నంటెడు విధియను వేటమృగము
పాటిలో జిక్కినట్టి దౌర్భాగ్యజీవి
రక్షజేయగ జాలవు రక్షకుడని
బిరుద మేరీతి గలిగెనో పరమపురుష!

గీ॥ నీ దయాసాగరము లోన నేమి కొఱత
కలిగెనో నిన్ను పలుమారు తలచి తలచి
దేహి యనువాని దాహంబు దీర్పవైతి
వరదుడను బిరుదెటు బోయె పరమపురుష?

గీ॥ దైవమా! నీవె కఠినము దాల్చితేని
మానవులు దానవులుగను మారిపోరె?
కంచెయేచేను మేసిన కనికరించి
అడవి పక్షిమృగాదులు అడ్డుపడునె!

సీ॥ సిరులలో నెవ్వేళ మురియుచుండు నొకండు
కూడొకింతయు లేక మాడు నొకండు
సంతాన మధికమై వంత జెందు నొకండు
పిల్లలు లేక చింతిల్లు నొకండు
తలపకయే ఫలంబులను పొందు నొకండు
తలచి ఘటిల్లక నలుగు నొకండు
దొడ్డపదవి నొందు దుర్మార్గు డొక్కండు
హైన్యస్థితి మెలంగు మాన్యుడొకండు

గీ॥ అలఘు కష్టంబు లొందు పుణ్యాత్ము డొకఁడు
అతి సుఖంబుల నొందు పాపాత్ము డొకఁడు
ఏమి సెప్పుదునయ్య సర్వేశ నీదు
చిత్రలీలల వర్ణన సేయుతరమె!

సీ॥ శరణార్థినై నిన్ను మొరవెట్టుకొన్నను
కొంచెమైనను నాలకించ వేల?
నోరు నొవ్వగనిన్ను సారెకు బిలచిన
బదులొక సారైన పలుకవేల?
ఎందెందు వెదకిన నెన్నొ డేని యొకింత
ప్రేమతోడను గాను పించవేల?
కన్నీళ్ల నీకాళ్లు కడిగి మ్రొక్కినగాని
కరుణాపయోధివై కరుగవేల?
గీ॥ చెవిటివాఁడవొ! మూగవాఁడవొ! శరీర
హీనుఁడవొ! కర్కశుండవొ! యెరుఁగరాదు
నిన్ను గొలచిన ఫలము గాన్పించదయ్యె!
భక్తహృత్పంకజనివేశ! పాపనాశ!

గీ॥ యాచనా లోచనముల నాలోచనముల
యెరుగ లేకుంటివో లేక యెరిగి యెరిగి
యెరుగనట్టి వానివలె నటింతువేమొ
మరుగు తెరవీడు టెప్పుడో అరయుకుంటి.

మాతృశ్రీ

ఉ॥ కమ్మిన చిమ్మ చీకటుల
కౌగిలి నుండి విమోచనార్థమై
క్రమ్మర ప్రాకులాడితి
అగాధములోబడి కాంతికోసమై
ఇమ్మహి నాస్తి కాధము లిహీ!
యని నవ్విరి నన్ను జూచి నిన్
నమ్మినవారి నీ పుడమి
నవ్వుల పాలొనరింతువా ప్రభూ!

ఉ॥ పుట్టుట గిట్టుటో మరల
పుట్టక గిట్టుటో! గిట్టి పుట్టుటో!
గిట్టుట పుట్టుటల్ దెలిసి
గిట్టని పుట్టుక పుట్టుటెట్టులో
మట్టి శరీర ధారులము
మాయ జగంబున బుట్టి సృష్టిలో
గుట్టు వెరుంగలేము మము
గూరిమితో దరిజేర్చ మీశ్వరా!

మృత్యు రాక్షసి

గీ॥ ఓసి మృత్యువ! వికటాట్ట హాసమేల
జేసెదసె! మజ్జనని స్వర్గసీమజేరి
సౌఖ్యముగ నుండె శుకము పంజరము వీడి
వృక్షశాఖాగ్రమును జేరి వెలయునట్లు.

గీ॥ ధాత్రి నీ పేరు విన్ననందరికి వేదె
ఓసి! రక్కసి మృత్యువా! ఒక్కరైన
పిలువరు గదా మరేటికి పిలువకున్న
జేరుచుండెదవందరి సిగ్గువిడిచి.

గీ॥ మృత్యువా మంచి చెడు లెంచకీ వదేల
వీరులను త్యాగరతుల కవిప్రవరుల
దాతలను నిత్యధర్మవర్తనుల మ్రింగి
మిట్టి పడెదు వారలకీర్తి మ్రింగ గలవె?

దుర్విధి

చ॥ కనికర మింతలేక నమ గన్న
దయామయి మాతృదేవతా
తనువు కృశింపజేసి విహితంబని
మ్రింగితి వారె! నీకు స
జ్జనముల హింస పెట్టుటయె సంతసమా!
ఇంక లేక దుష్టవ
ర్తనగలనీకు సజ్జన వితానము
వైరులె? తెల్పుదుర్విధీ!

కం॥ నిను పీడించిన జాడ్యం
బును మాన్పగ లేని నేర మునకున్ దుఃఖం
బును పొందవలసి వచ్చెను
జననీ! విధి నడ్డుకొన నశక్తుడ నైతిన్!

హృదయాంజలి

మ॥ ఎదలో దుఃఖ దవాగ్ని రేగినది
అందే నిల్పుకొన్నట్టి నీ
పద పద్మంబులు గాంచనేమొ యని
బాష్పాంబోనిధుల్ మ్రింగినన్
మదిలో నగ్ని శమింపదయ్యె నిఁక
నమ్మన్నాత కీవాత్మశాం
తి దయన్ గూర్చుచు నూరడింపగదెనన్
శ్రీ రాజ రాజేశ్వరా!

మ॥ చెలరేగెన్ జమగాడ్పు కల్పతరుఁగూల్చెన్
చిత్తశోకాగ్నియున్
జెలరేగెన్ బ్రవహించె బాష్పజలముల్
నేత్రాంబుధుల్ నిండి హాం
గులు గ్రక్కన్ దెగిపారె నే
నిలువలేకున్నాఁడ నీవాఁడ నీ
నిలయంబున్ గని నాడగావగదె నన్
శ్రీ రాజ రాజేశ్వరా!

శా॥ గుండెల్ దల్లడ మొందగా నురిమి
చక్షుల్ నిండవర్షించి హృ
త్ఖండక్షేత్ర విషాద దాహ మిసుమంతన్
దీర్చ లేకుండె నీ

యందఁ జేరితి నీకృపామృత రసం
బశ్రాంతముఁ జిల్కి పే
ర్మిం డెందంబును దృప్తి జేయగదవే!
శ్రీ రాజ రాజేశ్వరా!

మ॥ వెతలఁ బొందుచు కుందుచున్
హృదయ మన్వేషించు శాంతి ప్రస
న్నతకై కాని లభించదాయె
నిఁకనైనఁ బ్రేమతో నన్ను వి
స్తృత సంసార పయోధి దేల్చుచు
సదా స్వేచ్ఛా విహారమ్ముగా
ధృతి మీరన్ బ్రతుకంగ జేయగదవే!
శ్రీ రాజరాజేశ్వరా!

శా॥ ఏఁరాలేదిటు నిన్ను జూడగను
ప్రత్యేకంబుగానైన ఏ
దో రాజ్యాంగపు టూరు వెట్టి నను
యెంతో ప్రీతితో నీవె నీ
వే రప్పించితి దర్శనంబిడితి నీ
ప్రేమాంత రంగాలయ
శ్రీ రాజిల్లుచు మాకు చోటొసఁగుగా
శ్రీ రాజ రాజేశ్వరా!

మ॥ మడిలేకే చనుదెంచినాడను ప్రభూ!
మన్నింతువా నన్ను! నీ
గుడి కేతెంచితి రిక్తహస్తముల నన్
గూర్మిన్ గటాక్షింతువా!
యెడదే నీగుడి దానిలో వెలయు
నిన్నే రీతి సేవించుటో
మృడ! నా కయ్యది దెల్పి ప్రోవగదవే!
శ్రీ రాజ రాజేశ్వరా!

మ॥ పదముల్ సొలవు నీ పదాల్ గొలువ
భావంబంతకున్ జాలదిం
పొదవన్ని మహిమోన్నతుల్వొగడ
శంభో! ఎట్లు వర్ణింతునిన్
జదువుల్ నేర్వగ లేదు నీ పద
సరోజ శ్రీలపై వ్రాలి చే
సెద నీ సంస్తుతి దివ్యగానమళినై
శ్రీ రాజ రాజేశ్వరా!

మ॥ నిరుపేదన్ శిథిలంబు నా గృహము
తండ్రీ! జీవితం బెన్న సా
గరమై యొప్పును దాని యందుగల
పంకంబందె పంకేజముల్

విరియన్ బూచెను నీదు పూజకయి
సంప్రీతిన్ గటాక్షించి నా
చిరుకాన్కల్ గయికొమ్ము వేగమె ప్రభూ!
శ్రీ రాజ రాజేశ్వరా!

శా॥ ఈవా! ధాత్రి నగోచరుండవిక
నిన్నేలీల సేవింతునో
దేవా! నేనొక అల్పమానవుడ
సందేహాత్ముడన్ మూర్ఖుడన్
రావే! దర్శన మీయవే! వరములన్
ప్రాప్తింపగా జేయవే!
సేవింతున్ భవదీయ పాదయుగళిన్
శ్రీ రాజ రాజేశ్వరా!

శా॥ ఈవే విశ్వము విశ్వమంతయును
నీవే కాన ఈ దివ్య తే
జోవంతంబగు శిల్పికల్పిత కళా
సూక్ష్మంబులో లీనమై
నీ విశ్వాకృతి నిండి యుండదెటు?
నిన్నే నమ్మి కైమోడ్చుచున్
సేవింతున్ భవదీయ మూర్తిని హరా!
శ్రీ రాజ రాజేశ్వరా!

మాతృశ్రీ

మ॥ ఎండ దేనాటికి పూయకుండుటను
స్వామీ! రిక్తహస్తాల నీ
గుడికేతెంచితి సాగిలంబడి
త్వదంఘ్రుల్ బట్టుకొన్నాడ ప్రే
ముడితో నన్ను కృతార్థు! జేయుము
స్వయంభూ! శంభులింగ ప్రభూ!
దృఢ భక్తిన్ నిను గొల్తు మానసవిభూ!
శ్రీ రాజ రాజేశ్వరా!

శా॥ స్వామీ! నీవెశరణ్యమంచు మది
సంభావించి దైన్యంబుతో
నామూర్ధంబు భవత్పదాబ్జముల
నానన్ మోపి బాష్పాంబు ధా
రామాలిన్య మొనర్చు వాఁడనని
బల్ శంకించి కవ్వింపవా!
ప్రేమాపూర్ణునకిట్టి శంక తగునా!
శ్రీ రాజ రాజేశ్వరా!

ఈ పద్యములు శ్రీ వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని సందర్శించి వ్రాసినవి.

గీ॥ స్వామి! నీ పాదములఁ మనసార కడిగి
దైన్యమున మ్రొక్కులర్పింపఁ దలఁచినంత
యాచనా దీన నేత్ర ద్వయమ్ము నుండి
గోరు వెచ్చని కన్నీరు కురియ సాగె!

గీ॥ భక్తి రసపూర్ణ భావ సంపత్తి చేత
పొంగి పొరలెడు బాష్పతరంగములకు
యెడఁదలో నున్న మలినము కడుగబడియె
అడుగిడుము స్వామి నా యెదగుడిసెలోన!

గీ॥ శిథిలమైనట్టి నా చిన్ని చిత్త గృహము
లోన నడుగిడ భక్తి సోపానములను
వేసికొని నిన్ను బిలచితి వేగరమ్ము
ఆరగించగ పేద సత్కారములను.

గీ॥ హే ప్రభూ! హేదయాకర! హేదయాళూ!
పాహిమామ్! దీనబాంధవ! పాపహారి!
ఈవుదప్ప నితః పరంబెరుగ నయ్య!
రమ్ము వే వేగ నన్నేలఁ గొమ్ము స్వామి!

"అన్యథా శరణం నాస్తి
త్వమేవ శరణం మమ।
తస్మాత్కారుణ్యభావేన
రక్షరక్ష మహేశ్వర॥"

శాంతిగీతి

ఉ॥ శాంతము నీ స్వభావము, ప్రశాంతము
నీ హృదయమ్ము, భావమో
అంతకుమించి మంచుమలయై
విలసిల్లు, వచస్సులన్న న
త్యంత మృదు ప్రసన్న మధురామృత
ధారలు, భావకాత్మయున్
శాంతిలుగాక నిర్మల విశాల
కృపామతి మాతృదేవతా॥

"ఓం అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ"

ఓ దేవా మమ్ములను అసత్తు నుండి సత్తునకు
చీకటి నుండి వెలుగులోనికి
మృత్యువు నుండి అమృతత్వమునకు తీసుకొనిపొమ్ము!

"సర్వేషాం స్వస్తిర్భవతు
సర్వేషాం శాంతిర్భవతు
సర్వేషాం పూర్ణం భవతు"
ఓం శాంతిః శాంతిః శాంతిః